# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

## పత్రికా ప్రకటన

#

తేదీ : 12 మార్చ్

### సామ్రాజ్యవాద సంకెళ్ళు తెంచుకుందాం.

### బ్రాహ్మణవాద హిందూ ఫాసిజానికి ఘోరీ కడుదాం.

***ప్రియమైన ప్రజలారా,***

మార్చ్ 23, కామ్రేడ్ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజగురుల అమరత్వ దినంగా చరిత్రలో రక్తాక్షరాలతో లిఖితమైపోయింది. వారు మాతృభూమి వలస సంకెళ్ళను ఛేదించడానికి సాహసంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో పోరాడి తమ నవ యవ్వన ప్రాయంలో ఉరిశిక్షకు గురై తమ ప్రాణాలు త్యాగం చేశారు. వారు నాడు, నేడు మన దేశ యువతకు ఎంతో ఆదర్శప్రాయులుగా నిలిచారు. వారి ఆశయాలను తుదకంటా కొనసాగించాలని, ప్రగతిశీల-ప్రజాస్వామ్య దేశభక్త శక్తులకు, యావత్ ప్రజానీకానికి ముఖ్యంగా ఈ దేశ యువతకు వారి అమరత్వ దినాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటించాలని మా పార్టీ పిలుపునిస్తున్నది.

**కామ్రేడ్ భగత్‌సింగ్ ఆశయాలను ఒక్కసారి ఈ సందర్భంగా గుర్తు చేసుకుందాం.**

కామ్రేడ్ భగత్‌సింగ్ మరియు అతని సహచరులు దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన విప్లవకారులు. తెల్లవారి స్థానంలో ఆయన నల్లవారి దోపిడీ రావడాన్ని ఎన్నటికీ అనుమతించలేదు. ఆయన సోషలిస్టు సమాజాన్ని కోరుకున్న విప్లవకారుడు. ఆయన త్యాగాలను స్మరించుకోవడం అంటే దోపిడీరహిత సమాజ నిర్మాణం కోసం పోరాడడమే మనం చేయాల్సింది.

కామ్రేడ్ భగత్‌సింగ్ నాస్తికుడు. ఆయన మతం పేరుతో, కులాల పేరుతో ప్రజల మధ్య చీలికలు సృష్టించడాన్ని వ్యతిరేకించాడు. ఆయన ఒక సోషలిస్టు అవగాహనను పెంపొందించుకున్న విప్లవకారుడు కావడంతో వైజ్ఞానిక దృష్టికోణంతో ప్రజలకు పోరాట సందేశాన్ని అందించాడు. ఆ విప్లవకారుడి ఆశయాల సాధనకై పోరాడడం అంటే బ్రాహ్మణవాద దాష్టీకానికి ఘోరీ కట్టడమే తప్ప మరేమీ కాదు.

***విద్యార్థి, యువజనులారా !***

ఈనాడు మన దేశం మున్నెన్నటికన్నా తీవ్రమైన సామ్రాజ్యవాదుల దోపిడీకి బలవుతోంది. వర్తమాన పాలకవర్గాలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను అమలు చేయడంలో భాగంగా మనదేశ ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలను అమ్మకానికి పెట్టి వినాశకర ఆర్థిక వ్యవస్థగా మారుస్తున్నారు. దాని ఇప్పటి మరోపేరే మేక్‌ఇన్ ఇండియా. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలో గల ప్రభుత్వం అనేక సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలలో ఎన్నెన్నో వ్యాపార ఒప్పందాలు చేసుకుని దేశాన్ని వలసనాటి కన్నా హీనంగా మారుస్తున్నారు. వారి దోపిడీ విధానాలను ఎదుర్కోకుండా మన దేశానికెన్నటికీ నిజమైన స్వతంత్రం లభించదు. ఆ దోపిడీ విధానాలను ఎదుర్కోవడం అంటే నేటి యువత భగత్‌సింగ్ చూపిన మార్గంలో పోరాడడం మినహా మార్గం లేదు.

సామ్రాజ్యవాదంతో బ్రాహ్మణం చెట్టాపట్టాలేసుకుని రాజ్యమేలుతోందన్న వాస్తవాన్ని నేటి యువతరం గ్రహించాలి. వర్తమానంలో కేంద్రంలో అధికారంలో ఉన్న పాలకవర్గ ముఠా కరుడుగట్టిన హిందుత్వ శక్తులతో కూడుకున్నదే కావడంతో దేశాన్ని పరమ ప్రగతి నిరోధకంగా మారుస్తోంది. దేశ సామాజిక, సాంస్కృతిక రంగాలన్నిటా కాలంచెల్లిన బ్రాహ్మణ భావజాలాన్ని నింపుతూ అభివృద్ధి నిరోధకంగా ఉంది. మనదేశంలోని మెజారిటీ ప్రజల సాకుతో హైందవ మతం మత్తులో ముంచెత్తుతూ పరమ ఫాసిస్టు విధానాలను అమలు చేస్తున్నది. ఆ విధానాలను అడ్డుకుంటున్న విలేకరులను, హేతువాదులను, ప్రగతిశీల-ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులను హత్య చేస్తున్నారు. ప్రజా ఆకాంక్షల సాధనకై విప్లవిస్తున్న యువతను టెర్రరిస్టులుగా ముద్ర వేస్తున్నారు. దేశవ్యాప్తంగా అధికారంలో కాషాయ జెండాను ఎగురవేయడానికి ఉవ్విళ్ళూరుతూ 21 రాష్ట్రాలలో అధికార పగ్గాలను అందుకున్నారు. ప్రపంచ మానవాళి విముక్తి కోసం పోరాడిన కామ్రేడ్ లెనిన్ విగ్రహాలను, బ్రాహ్మణవాదాన్ని అడ్డుకున్న రామస్వామి పెరియార్ విగ్రహాలను సహించలేకపోతున్న హిందుత్వ శక్తులు వాటిని కూల్చడం మొదలుపెట్టారు. మత మౌఢ్య శక్తులను ఓడించకుండా, బ్రాహ్మణ మతానికి ఘోరీ కట్టకుండా భగత్‌సింగ్ ఆశయాలను నెరవేర్చలేం. 2022 నాటికి నవ భారతాన్ని నిర్మిస్తామంటూ ఊదరగొడుతున్న మోదిత్వ శక్తులు ఏనాటికానాడు ఘరానా కార్పోరేట్ సంస్థల దోపిడీకి గురిచేస్తూ బ్రాహ్మణమత భావజాలంతో మన దేశ ప్రజా జీవితాలను అతలాకుతలం చేస్తున్నారు.

***యువజనులారా !***

ఈ దేశంలో అన్ని సెక్షన్‌ల ప్రజలు పోరాడుతున్నారు. ఆత్మహత్యలతో విసిగి వేసారిన రైతాంగం నిరసన ర్యాలీలు, మిలిటెంట్ పోరాటాలు చేస్తున్నారు. విద్యార్థులు న్యాయమైన తమ సమస్యలపై పోరాడుతున్నారు. కార్మికులు, ఉద్యోగులు, మేధావులు, మహిళలు,

బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులకు, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. వారితో భుజం భుజం కలిపి నేటి యువత భగత్‌సింగ్ మార్గంలో పోరాడాలని మా పార్టీ కోరుతోంది.

నేడు దేశంలో మా పార్టీ నాయకత్వంలో విప్లవోద్యమం కొనసాగుతోంది. విప్లవ ప్రజలు అసమాన త్యాగాలతో పోరాడుతున్నారు. విప్లవోద్యమ ప్రాంతాలలో లక్షలాది సాయుధ బలగాలను దోపిడీ పాలకులు మోహరించినా మా పీఎల్‌జీఏ నాయకత్వంలో ప్రజలు గెరిల్లా యుద్ధతంత్రాన్ని కొనసాగిస్తున్నారు. విప్లవకారులే నిజమైన దేశ భక్తులంటూ దేశ చరిత్ర పుటలలో గత ఐదు దశాబ్దాలుగా లిఖితమవుతోంది. బ్రాహ్మణవాదానికి వ్యతిరేకంగా సాగుతోన్న దేశవ్యాప్త పోరాటాలలో, ప్రజా నిరసన చర్యలలో విప్లవోద్యమం పాల్గొంటూ అభ్యుదయ శక్తులతో భుజం భుజం కలిపి నడుస్తోంది. భగత్‌సింగ్‌కు నిజమైన వారసులుగా మావోయిస్టు ఉద్యమం దేశంలోనే ఒక నమూనాగా పురోగమిస్తుంది. దీనిని నిర్మూలించడానికి హిందుత్వ శక్తులు కొత్త కొత్త వ్యూహాలతో (సమాధాన్) బరితెగిస్తున్న తరుణంలో ఈ దేశంలోని 65% యువత విప్లవోద్యమ పక్షాన నిలిచి భగత్‌సింగ్ ఆశయాల సాధనకై సాహసంగా విప్లవించాలని మా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.

☆ మార్చ్ 23 సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సభలు, సమావేశాలు జరపండి. ర్యాలీలు నిర్వహించండి.

☆ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను సాహసంగా మిలిటెంట్ చర్యలలోకి కదిలించండి.

Abhay

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**